సాక్షి ప్రకాశం

గురువారం । 27 । ఏప్రిల్ । 2023



ప్రతి ఇంటా రూ.లక్షల్లో లబ్ధి

ఏ ఇంట చూసినా రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో లక్షల్లో లబ్ధి చేకూరిందని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. చీమకుర్తిలో గడపగడపకు పర్యటించారు. - 12లో..



ఎక్స్‌ప్రెస్ హైవే స్థల పరిశీలన

విజయవాడ-కడప-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా పొదిలి మండలం ఉప్పలపాడు వద్ద జంక్షన్ ఏర్పాటుకు స్థలాన్ని జేసీ పరిశీలించారు. - 12లో..

గరిష్ఠం/కనిష్ఠం
38 /25

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది.
వాతావరణం పొడిగా ఉంటుంది.
ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగ్గురు డీఎస్పీల బదిలీ



డీఎస్పీ వీర రాఘవరెడ్డి

ఒంగోలు టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం డీఎస్పీలతో పాటు దిశ డీఎస్పీని బదిలీ చేశారు. ఒంగోలు డీఎస్పీగా టి.అశోక్ వర్ధన్‌ను బదిలీ చేస్తూ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఒంగోలు డీఎస్పీగా పనిచేసిన యు.నాగరాజును హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయమన్నారు. దిశ డీఎస్పీ ఏ.వల్లపురాజును గురజాల డీఎస్పీగా బదిలీ చేశారు. మార్కాపురం డీఎస్పీ ఎం.కిశోర్ కుమార్‌ను అమలాపురానికి బదిలీ చేసి ఆయన స్థానంలో విజిలెన్స్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జి.వీర రాఘవరెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

జనరిక్ మందులపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: తక్కువ ధరలకు లభిస్తూ ప్రయోజనకరంగా పనిచేసే జనరిక్ మందుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో బుధవారం నూతనంగా ఏర్పడిన కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ జనరిక్ మందులపై సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. దీనిలో రెడ్‌క్రాస్ జీవిత సభ్యత్వం, వాతావరణ కాలుష్య నివారణ, అంబులెన్స్ సర్వీస్, రిమ్స్‌లో రెడ్‌క్రాస్ ద్వారా నైట్ షెల్టర్ ఏర్పాటుతో పాటు మొత్తం పది రకాల అంశాలను చర్చించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ప్రకాష్ బాబు, సెక్రటరీ బాబురావు, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారి రాఘవయ్య, ఎంసీ, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

బాలికలే టాప్



ఇంటర్మీడియెట్ ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. మొదటి సంవత్సరంలో 56 శాతం, ద్వితీయ సంవత్సరం 81 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా మొదటి సంవత్సరానికి సంబంధించి రాష్ట్రస్థాయిలో పదో స్థానం, రెండో సంవత్సరంలో 7వ స్థానంలో నిలిచింది. గతేడాది ఫలితాలతో పోల్చుకుంటే ఈ దఫా వెనుకబడి కొంత నిరాశను మిగిల్చాయి. ఒకేషనల్‌లో మాత్రం మొదటి స్థానంలో నిలిచింది.

- ఇంటర్ రెండు సంవత్సరాల ఫలితాల్లోనూ బాలికలదే పైచేయి
- రాష్ట్రస్థాయిలో పడిపోయిన ర్యాంకు
- ప్రథమ సంవత్సరంలో 10, ద్వితీయ సంవత్సరంలో 7వ స్థానం
- ఒకేషనల్‌లో ప్రథమ స్థానం

ఒంగోలు: ఇంటర్మీడియెట్ ఫలితాలు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కొంత నిరాశను మిగిల్చాయి. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో జిల్లా ర్యాంకు పడిపోయింది. ఇంటర్ రెండో సంవత్సరానికి సంబంధించి 20,717 మంది విద్యార్థులు హాజరవగా 14,477 మంది ఉత్తీర్ణులయ్యారు. 70 శాతంతో జిల్లా రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచింది. అలాగే మొదటి సంవత్సరంలో 23,780 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 12104 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో జిల్లా పదో స్థానంతో సరిపెట్టుకుంది. గతేడాది రెండు సంవత్సరాల్లో ఆరో ర్యాంకును సాధించింది.

ఒకేషనల్‌లో టాప్..

ఒకేషనల్ విభాగానికి సంబంధించి ద్వితీయ సంవత్సరంలో 1337 మంది బాలురకు 864 మంది (65 శాతం), 1152 మంది బాలికలకు 918 మంది (80 శాతం) ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో మొదటి స్థానాన్ని సాధించింది. అలాగే మొదటి సంవత్సరంలో 1260 మంది బాలురకు గాను 557 మంది (44 శాతం), 1378 మంది బాలికలకుగాను 846 మంది (61 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ప్రథమ సంవత్సరంలో...

ప్రథమ సంవత్సరం జనరల్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 23,780 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో 12,104 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో 11,318 మంది బాలురు హాజరుకాగా 5,159 మంది (46 శాతం) మంది మాత్రమే పాసయ్యారు. 12,462 మంది బాలికలు హాజరుకాగా 6,945 మంది బాలికలు (56 శాతం) ఉత్తీర్ణులయ్యారు. దీంతో మొత్తం మీద 51 శాతం ఉత్తీర్ణతతో ఉమ్మడి జిల్లా మొదటి సంవత్సరం ఫలితాల్లో 10వ స్థానంలో నిలిచింది.

సంవత్సరం	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులైనవారు	ర్యాంకు
2019	26333	14336	10
2020	27586	14885	9
2021	31760	31760	....
2022	14272	14272	6
2023	23780	12104	10

ద్వితీయ సంవత్సరంలో 7వ ర్యాంకు

ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 20,717 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 14,477 మంది విద్యార్థులు పాసయ్యారు. దీంతో జిల్లా ఈ ఏడాది 7వ స్థానంలో నిలిచింది. గత ఏడాది 6వ స్థానంలో నిలిచిన సంగతి విదితమే.

సంవత్సరం	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులైనవారు	ర్యాంకు
2019	23481	15883	9
2020	23590	13956	7
2021	29897	29897	....
2022	22567	16136	6
2023	20717	14477	7

ఏపీ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కాలేజీ: 1

మొదటి సంవత్సరం పరీక్షకు హాజరైన వారు 77 మంది, ఉత్తీర్ణులైన వారు 30 మంది (38.96 శాతం)

ఏపీ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కాలేజీలు: 14

	హాజరైన వారు	ఉత్తీర్ణులైన వారు	ఉత్తీర్ణత శాతం
మొదటి సంవత్సరం	864	563	65
రెండో సంవత్సరం	876	661	75.46

ప్రభుత్వ జూనియర్ కాలేజీలు: 33

	హాజరైన వారు	ఉత్తీర్ణులైన వారు	ఉత్తీర్ణత శాతం
మొదటి సంవత్సరం	3561	619	24
రెండో సంవత్సరం	2441	1089	44.6

ఎయిడెడ్ జూనియర్ కాలేజీలు: 6

	హాజరైన వారు	ఉత్తీర్ణులైన వారు	ఉత్తీర్ణత శాతం
మొదటి సంవత్సరం	445	122	27.42
రెండో సంవత్సరం	156	156	45.22

చదువుకు పేదరికం అడ్డుకాదు



విద్యార్థులకు జగనన్న వసతి దీవెన చెక్కు అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

- విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు
- జిల్లాలో 43,878 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.46.72 కోట్ల జగనన్న వసతి దీవెన నగదు
- మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు అర్బన్: చదువుకునేందుకు పేదరికం అడ్డు కాకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ఆ మేరకు విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టి పేద పిల్లలు చదువుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. బుధవారం జగనన్న వసతి దీవెన పథకంలో భాగంగా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిధులు జమ చేసే కార్యక్రమం అనంతపురం జిల్లా నార్పలలో నిర్వహించారు. దీనికి అనుబంధంగా ప్రకాశం భవనంలో కార్యక్రమం నిర్వహించారు. దీనిలో మంత్రి సురేష్‌తో పాటు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు.

దీనిలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 48,499 మంది అర్హులైన విద్యార్థులకు చెందిన 43,878 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.46,72,17,500 సీఎం నేరుగా జమ చేశారన్నారు. జిల్లాలో లబ్ధిపొందుతున్న విద్యార్థుల్లో ఎస్సీలు 12,341, ఎస్టీలు 1086, బీసీలు 16,032, ఈబీసీ 12,980, ముస్లిం మైనార్టీలు 3,100, కాపులు 2908, క్రైస్తవ మైనార్టీలు 52 మంది ఉన్నారన్నారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బకాయిలను కూడా అధికారంలోకి వచ్చాక వైఎస్ జగన్ చెల్లించారన్నారు. ఏడాదికి రెండుసార్లు శాచురేషన్ పద్ధతిలో అర్హులందరికీ ప్రభుత్వం వసతి దీవెన ద్వారా అండగా నిలుస్తుందన్నారు. విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి ఇదే నిదర్శనమన్నారు. అంతేకాకుండా విద్య పూర్తయిన వారికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులు కావాలని విద్యార్థులకు సూచించారు.

కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తూ విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపట్టిందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, అన్నీ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం పరిపాలన సాగిస్తున్నారన్నారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నీ రకాలుగా అండగా ఉంటుందన్నారు. దీనిలో మేదర కార్పొరేషన్ చైర్‌పర్సన్ లలితానాంచారమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అంజల, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, మైనార్టీ సంక్షేమ అధికారి అర్చన, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్

బీసీలంటే విశ్వాసానికి మారుపేరు

- మీ సమస్యల పరిష్కారానికి వారానికోరోజు కేటాయిస్తా
- ఆరామ క్షేత్ర నిర్మాణానికి నావంతు ఆర్థికసాయం అందిస్తా
- నగర పరిధిలోని బీసీ కులాల ఆత్మీయ సదస్సులో బాలినేని



బాలినేని శ్రీనివాసరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఒంగోలు: బీసీలంటే విశ్వాసానికి మారుపేరు అని, అటువంటి మీరు నా పట్ల చూపుతున్న విశ్వాసానికి జీవితాంతం రుణపడి ఉంటానని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక బాలినేని నివాసంలో బుధవారం నగర పరిధిలోని 18 బీసీ కుల సంఘాల నాయకులతో ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదుసార్లు తన గెలుపులో బీసీలు ప్రముఖ పాత్ర వహించారన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 9 బీసీ కులాలకు ఆరామ క్షేత్రాల కోసం స్థలాన్ని కేటాయించామన్నారు. కానీ తరువాత వచ్చిన టీడీపీ పూర్తిగా బీసీల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి రాజకీయ పదవులు సైతం పెద్ద ఎత్తున కేటాయించారన్నారు. బీసీల కోసం వారంలో ఒకరోజు ప్రత్యేకంగా కేటాయిస్తానని హామీ ఇచ్చారు. బీసీలు నిర్మించుకునే ఆరామ క్షేత్రానికి తన వంతు ఆర్థికసాయం కూడా అందిస్తానని హామీ ఇచ్చారు. బీసీ సెల్ అధ్యక్షుడు గోలి తిరుపతిరావు ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాల నాయకులతో ఒక కమిటీ కూడా వేసి వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు చేపడతానని ఈ సందర్భంగా బాలినేని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు మాట్లాడుతూ 2019లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ 151 సీట్లు గెలిచిందంటే అందులో బీసీల పాత్ర గణనీయం అన్నారు. ఏలూరు సభలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదు... బ్యాక్ బోన్ అంటూ నింపిన ఆత్మ గౌరవాన్ని ఏ ఒక్క బీసీ కూడా మరువరాదన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో ఆమోదించి పార్లమెంట్‌కు పంపిన ఘనత సీఎం జగన్‌ది అన్నారు. 18 కులాలకు ఆరామ క్షేత్రాలు ఉండాలనే ఉద్దేశంతో అన్ని కుల సంఘాలతో మాట్లాడి సమస్యను సర్దుబాటు చేసిన ఘనత బాలినేనిదన్నారు. గతంలో ఆరామ క్షేత్రాన్ని వాసన్న కేటాయిస్తే దానిలోకి కూడా బీసీలు వెళ్లనీయకుండా మాజీ ఎమ్మెల్యే దామచర్ల అడ్డుపడ్డారనే విషయాన్ని బీసీలు మరువరాదన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీసెల్ మాజీ అధ్యక్షుడు కటారి శంకర్ మాట్లాడుతూ 2008లోనే బీసీల సమస్యను అర్థం చేసుకుని 9 కులాలకు ఆరామ క్షేత్రాల కోసం బాలినేని స్థలం కేటాయించారన్నారు. అయితే 18 కులాలకు స్థల సమస్య ఉండడంతో గతంలో స్థలాన్ని కేటాయించిన 9 కుల సంఘాల నాయకులతో చర్చించి అందరికీ సర్దుబాటు చేయించారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు తన్నీరు ఆంజనేయులు, చలపతి, పందేటి శ్రీనివాసరావు, ఉప్పర శ్రీనివాసరావు, మద్దులూరి శ్రీనివాసులు, సుతారాం శ్రీనివాసులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరం



మురుగునీటి శుద్ధి ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్ కుమార్



మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, పక్కన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ మీనాకుమారి

- మురుగు నీటి శుద్ధి ప్లాంటుతో ఎంతో మేలు
- రూ.230 కోట్లు వెచ్చించి ఇళ్ల ప్లాట్లకు భూములు కొనుగోలు చేస్తున్నాం
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి
- ఒంగోలు నగరానికి రెండో ప్లాంటు కూడా మంజూరు చేయిస్తామన్న రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు సబర్బన్: వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమని ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని గుత్తికొండవారిపాలెంలో కొప్పోలు-పాదర్తి రోడ్డులో పోతురాజు కాలువపై నిర్మించిన మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్లాంటులోని వివిధ విభాగాలను కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌తో కలిసి ఇరువురు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు నగరానికి ఈ ప్లాంటు ఎంతో అవసరమన్నారు. అభివృద్ధి చెందుతున్న నగరానికి పర్యావరణ పరిరక్షణలో భాగంగా మురుగు నీటి శుద్ధి కేంద్రం ఆవశ్యకత ఎంతో అవసరమన్నారు. ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని బాలినేని ధీమాగా చెప్పారు. యరజర్లలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సంకల్పిస్తే టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారన్నారు. అయినా రైతుల వద్ద నుంచి భూములు కొనుగోలు చేసి మరీ ఇవ్వటానికి సంకల్పించామన్నారు. మొత్తం 25 వేల మందికి పైగా ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశామన్నారు. అందుకుగాను ప్రభుత్వం ఇప్పటికే భూములు ఇచ్చిన రైతుల కోసం రూ.30 కోట్లు విడుదల చేసిందన్నారు. మరో రూ.200 కోట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రతి రోజు మంచినీరు ఇచ్చేలా అమృత్ పథకంలో రూ.340 కోట్లు మంజూరు చేశారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏడు గుండ్లపాడు నుంచి ఒంగోలు నగరానికి మంచినీళ్లు ఇచ్చే పథకానికి రూ.120 కోట్లు మంజూరు చేస్తే రూ.70 కోట్లు ఒంగోలు నగర పాలక సంస్థపై భారం పడిందన్నారు. అదే ఇప్పుడు రూ.340 కోట్లు సీఎం వైఎస్ జగన్ మంజూరు చేశారని, కేవలం రూ.7 కోట్లు మాత్రమే ఒంగోలు నగర పాలక సంస్థ భరించాల్సి వస్తుందన్నారు. పచ్చ పత్రికలు పనికట్టుకొని అసత్యాలు రాస్తున్నాయని మండిపడ్డారు. ఆంధ్రజ్యోతి మరీ బరితెగించి రాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సహనాన్ని పరీక్షిస్తున్నారని, పత్రికలను తగులబెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ఒంగోలు నగరానికి రెండో మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. నల్లకాలువపై నిర్మించేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. బాలినేని ఆధ్వర్యంలో ఒంగోలు నగరం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతిరోజు 1.50 కోట్ల లీటర్ల మురుగునీటిని ప్రతిరోజూ శుద్ధి చేస్తారన్నారు. టీడీపీ నాయకులు సెల్ఫీ ఛాలెంజ్‌లంటూ సిగ్గు లేకుండా కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇళ్లు మంజూరు చేయకుండానే ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేసి నిలువునా మోసం చేసిన టీడీపీ నాయకులు ఏ ముఖం పెట్టుకొని సెల్ఫీ ఛాలెంజ్‌లు చేస్తున్నారో వాళ్లకే అర్థం కావటం లేదని అన్నారు.

కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ మాట్లాడుతూ మురుగు నీటి శుద్ధి కేంద్రం ఒంగోలు నగరానికి ఎంతో అవసరమన్నారు. మరో శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తే పూర్తి స్థాయిలో పర్యావరణం పరిరక్షణ చేయగలుతామన్నారు. కార్యక్రమానికి ఒంగోలు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మేయర్ గంగాడ సుజాత, ఉడా చైర్మన్ శింగరాజు మీనాకుమారి వెంకట్రావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్య నారాయణ, స్థానిక కార్పొరేటర్ వెన్నపూస శోభారాణి వెంకట్ రెడ్డి, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వాకా బసివి రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తమ్మినేని మాధవి, కఠారి శంకర్, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, యనమల నాగరాజు, బొట్ల సుబ్బారావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, ఈఈ ఎస్‌కే.రహంతు జానీ, ఎంఈ కే.మాల్యాద్రి, ఏసీపీ కేవీ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభినవ 'ఏకలవ్యుడు'!

- సొంత ప్రిపరేషన్‌తో రైల్వే టీసీగా ఎంపికైన రైతు బిడ్డ

కొమరోలు: సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకుంటే ఫలితం ఎలా ఉంటుందో చేతల్లో చూపాడు ఓ యువకుడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కోచింగ్ సెంటర్లకు వెళ్లలేని ఆ అభినవ 'ఏకలవ్యుడు' యూట్యూబ్‌ను గురువుగా ఎంచుకున్నాడు. ఏకంగా రెండు రైల్వే ఉద్యోగాలకు ఎంపికై అందరి దృష్టి తనవైపునకు తిప్పుకున్నాడు. కొమరోలు మండలం పోసుపల్లె గ్రామానికి చెందిన బొంత చిన్నకొండారెడ్డి, మహాలక్ష్మి దంపతులది పేద కుటుంబం. కష్టనష్టాలకోర్చి వ్యవసాయం చేస్తూనే తమ కుమారుడు తిరుపతిరెడ్డి డిగ్రీ వరకు చదివించారు. బీఎస్సీ కంప్యూటర్స్‌లో డిగ్రీ పట్టా పొందిన తిరుపతిరెడ్డి రైల్వే ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు. కోచింగ్ సెంటర్లకు వెళ్లేందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించ లేదు. దీంతో తల్లిదండ్రులకు వ్యవసాయంలో చేదోడుగా ఉంటూ యూట్యూబ్‌ను వీడియోలు చూసి సొంతగా ప్రిపరేషన్ ప్రారంభించాడు. ప్రభుత్వ వెబ్‌సైట్లు, యూట్యూబ్ వీడియోల నుంచి సంగ్రహించిన సమాచారంతో నోట్స్ తయారు చేసుకుని తన అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. ఎన్‌టీపీసీ-2019 నోటిఫికేషన్ విడుదల కాగా కమర్షియల్ కం టికెట్ క్లర్క్ పోస్టుకు దరఖాస్తు చేశాడు. కరోనా కారణంగా వాయిదా పడుతూ వచ్చిన ఆ పరీక్షను రైల్వే శాఖ 2021లో నిర్వహించగా ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యాడు. 2022లో మెయిన్స్ రాసి ఫలితాల కోసం ఎదురు చూడసాగాడు.

తలుపుతట్టిన అదృష్టం..

రైల్వే శాఖ గ్రేడ్-4 ఉద్యోగాల ఎంపికకు నిర్వహించిన పరీక్షలో తిరుపతిరెడ్డి సత్తా చాటాడు. బుధవారం బెంగళూరులో గ్రేడ్-4 ఉద్యోగంలో చేరాల్సి ఉంది. మరికొద్ది నిమిషాల్లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉన్న తరుణంలో ఎన్‌టీపీసీ-2019 నోటిఫికేషన్‌కు సంబంధించి ఫలితాలు విడుదలయ్యాయి. కమర్షియల్ కం టికెట్ క్లర్క్ ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలియగానే తిరుపతిరెడ్డి సంతోషానికి అవధుల్లేవు. దీంతో గ్రేడ్-4 ఉద్యోగంలో చేరకుండానే బెంగళూరు నుంచి స్వగ్రామమైన పోసుపల్లెకు తిరుగుప్రయాణం అయ్యాడు.



యూట్యూబ్ వీడియోలు వీక్షిస్తున్న తిరుపతిరెడ్డి

ఒకటే చానల్.. ఒకటే లక్ష్యం

మాది పేద కుటుంబం. జాబ్ కోచింగ్‌కు వేల రూపాయలు ఖర్చు చేసే స్తోమత నా తల్లిదండ్రులకు లేదు. జాబ్ ప్రిపరేషన్‌కు సంబంధించి యూట్యూబ్‌లో చాలా చానల్స్ ఉన్నాయి. నేను వైఫై అనే చానల్‌ను ఫాలో అవుతూ సొంతగా నోట్స్ తయారు చేసుకున్నా. రోజూ 5 గంటలపాటు శిక్షణ పొందా. సెల్ఫ్ మోటివేషన్‌తో ప్రభుత్వం ఉద్యోగం పొందాలన్న నా కల సాకారమైంది.

– బొంత తిరుపతిరెడ్డి

ప్రజలందరి నమ్మకం జగనన్నే

- సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం
- ప్రతి ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు చదివి వినిపించిన ఎమ్మెల్యే బాలినేని
- గోపాల్‌నగర్ గడప గడపకు మన ప్రభుత్వంలో బాలినేనితో కలిసి పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్



గోపాల్‌నగర్ చాకలిగుంటలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: ప్రజలందరి నమ్మకం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం నగరంలోని 5వ డివిజన్ గోపాల్‌నగర్, సాయంత్రం 32వ డివిజన్ పరిధిలోని గద్దలగుంట, మామిడిపాలెంలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. తొలుత 5వ డివిజన్‌లోని గోపాల్‌నగర్ నాలుగో లైన్‌లోని కోటా బజార్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వచ్చిన సంక్షేమ పథకాలు, ఈ నాలుగేళ్లలో ఏఏ పథకాలు, ఎంతెంత వచ్చాయో స్థానిక మహిళల నుంచి సమాధానాలను రాబట్టారు. రెండు డివిజన్లలో మహిళలు బాలినేనికి హారతులతో, పూలతో స్వాగతం పలికారు. చంద్రబాబు హయాంలో డ్వాక్రా మహిళలను, రైతులకు ఏ విధంగా మోసం చేసింది స్వయంగా మహిళలు బాలినేనికి వివరించారు. జగనన్న ప్రభుత్వంలో అమ్మఒడి మొదలుకొని ప్రతి ఇంటికి వస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాల గురించి స్థానిక మహిళలు వివరించారు. ప్రతి ఇంటికి వచ్చిన సంక్షేమ పథకాలను బాలినేని చదివి వినిపించారు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో మద్దతు ఇవ్వాలని కోరారు. 5వ డివిజన్ కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు, 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలతతో కలిసి బాలినేని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు, 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణ, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, కార్పొరేటర్లు గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ తిరుపతిరావు, ఈదర సురేష్ బాబు, చల్లా తిరుమలరావు, చింతపల్లి గోపీచంద్, శ్రీరాం నాగభూషణం, నాగం వెంకట శేషయ్య, ట్రేడ్ యూనియన్ నాయకులు పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, జాజుల కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు చావల శ్రీనివాస రావు, చింతగుంట్ల సువర్ణ, బొమ్మినేని మురళి, 32వ డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు కోసూరి శేఖర్, తోటపల్లి సోమశేఖర్, చిట్టెం సురేష్, మన్నేపల్లి అంకబాబు, జువ్విశెట్టి వెంకట్రావు, నత్తల బీమేష్, గాజుల సాయి, ఓగిరాల వెంకట్రావు, తోటపల్లి వెంకటేష్, గరికపాటి గోపాల కృష్ణ, గొర్రెపాటి శ్రీనివాసులు, మారెళ్ల శ్రీనివాసులు, పురిణి ప్రభావతి, ధామరాజు క్రాంతికుమార్, భూమిరెడ్డి రమణమ్మ, పుట్టా సుధాకర రెడ్డి, పలుపులేటి శ్రీనివాసరావు, నక్కల లీలాకుమారి, మీరావలి, మోడుబోయిన సురేష్, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ రెడ్డి, తాళ్లపాలెం శ్రీను, జమ్ము శ్రీకాంత్, వాకా తిరుమల, పి.మోహన్ రావు, బొట్ల సుబ్బారావు, ఆసోది విజయలక్ష్మి, విక్కీ వెంకటేశ్వర్లు, ఎస్‌కే.ఖుద్దూస్, రామిశెట్టి హరి, ఆవుల సురేంద్ర, గొల్లపోలు కృష్ణ, జాజుల కృష్ణ, రావులపల్లి శ్రీకాంత్, కఠారి సురేష్ పాల్గొన్నారు.

4.81 లక్షల మంది కూలీలకు 'ఉపాధి'

- ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వంద పని దినాలు పూర్తి చేయించడమే లక్ష్యం
- డ్వామా పీడీ కె.శీనారెడ్డి



కొండపిలో ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ శీనారెడ్డి

కొండపి: ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రోజూ 4,81,585 మంది కూలీలకు పని కల్పిస్తున్నట్లు డ్వామా పీడీ శీనారెడ్డి పేర్కొన్నారు. కొండపి నియోజకవర్గంలోని సింగరాయకొండ, మర్రిపూడి మండలాల్లో ఉపాధి హామీ పథకం పనులను బుధవారం తనిఖీ చేసిన ఆయన కొండపి ఏపీఓ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశాన్ని రెండు సమయాల్లో ఫొటోలు తీసి పంపాలని సిబ్బందికి స్పష్టం చేసినట్లు తెలిపారు. రోజూ ఒక్కో కూలీకి కొలతల ప్రకారం సరాసరిన రూ.272 కూలి అందాల్సి ఉండగా రూ.222 మాత్రమే పొందుతున్నారన్నారు. పూర్తి కూలి పొందేలా కూలీలతో పనిచేయించాలని చెప్పారు. జిల్లాలో 4,36,375 జాబ్ కార్డులు ఉండగా 8,12,610 మంది కూలీలుగా నమోదై ఉన్నారని తెలిపారు. 3,89,000 జాబ్‌కార్డులు ప్రస్తుతం యాక్టివ్‌గా ఉండగా 4,81,585 మంది ఉపాధి హామీ పనికి వస్తున్నట్లు వెల్లడించారు. ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు చెందిన వారు నూరు పని దినాలు చేసుకోవడం లేదని, ఆ దిశగా వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. కొండపి మండలంలో 12 వేల మంది కూలీలు ఉండగా ప్రస్తుతం 2500 మంది పనికి వస్తున్నారన్నారు. ఉపాధి సిబ్బంది ఎక్కడైనా అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని విలేకర్ల అడిగిన ప్రశ్నకు డ్వామా పీడీ బదులిచ్చారు.

దివ్యాంగుల చట్టం పక్కాగా అమలు చేయాలి

కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: దివ్యాంగుల హక్కుల చట్టం పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. స్పందన భవనంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అర్చన అధ్వర్యంలో బుధవారం దివ్యాంగుల చట్టం-2016 అమలుపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. చట్టంలో పొందుపరిచిన ఆయా శాఖల అధికారులు, కమిటీ సభ్యుల సమర్థవంతంగా పనిచేయాలన్నారు. సమావేశంలో డీపీఓ నారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాబురావు, మెప్మా పీడీ, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంపియన్‌గా కె.బిట్రగుంట కేజీబీవీ



విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈఓ నాగేంద్రవదన్

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట కేజీబీవీ విద్యార్థులు వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. ఈ నెల 22, 23వ తేదీల్లో విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్, జూనియర్ ఎక్విప్‌డ్ పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా నుంచి 25 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా కె.బిట్రగుంట కేజీబీవీ నుంచి 19 మంది విద్యార్థినులు ప్రాతినిధ్యం వహించారు. ఒక బంగారు పతకం, 4 కాంస్య, 5 రజత పతకాలతోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న విద్యార్థినులను బుధవారం ఎంఈఓ బి.నాగేంద్ర వదన్ అభినందించారు. విద్యలోనే కాకుండా క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ఎస్.స్రవంతి, పీఈటీ బి.హెప్సిబా పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌లు చోరీ

ఒంగోలు టౌన్: స్థానిక సుందరయ్య భవన్ రోడ్డులోని బాయ్స్ హాస్టల్లో రెండు ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయ్యాయి. బాధిత విద్యార్థుల ఫిర్యాదు మేరకు బుధవారం ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న అనుమోలు మణిదీప్, హనుమంతుని బ్రహ్మేశ్వరరావు సుందరయ్య రోడ్డులోని రాజన్న బాయ్స్ హాస్టల్లో ఉంటున్నారు. మంగళవారం తెల్లవారుజామున నిద్రలేచాక తమ బ్యాగుల్లో ల్యాప్‌ట్యాప్‌లు మాయమైనట్లు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు తమ ల్యాప్‌ట్యాప్‌లు దొంగిలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ఒంగోలు: జాతీయ లోక్ అదాలత్ మే 13న జిల్లాలోని అన్ని కోర్టుల్లో నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఏ భారతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడేందుకు అవకాశం ఉన్న అన్ని క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా పరిహారపు చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇద్దరి ఆమోదంతో పరిష్కరిస్తామన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల్లో ఉన్న వారు ఉపయోగించుకుని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలన్నారు. పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి న్యాయశాఖకు సహకరించాలని కోరారు.

జీజీహెచ్‌లో పిల్లల ప్లే ఏరియా ప్రారంభం



జీజీహెచ్‌లో ప్లే ఏరియా ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ భగవాన్ నాయక్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీహెచ్) పిల్లల విభాగంలో ప్లే ఏరియాను ఆసుపత్రి సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహారం లోపం ఉన్న పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు న్యూట్రిషన్ రిహ్యాబిలిటేషన్ సెంటర్ ఉపకరిస్తుందన్నారు. పిల్లల సంపూర్ణ ఎదుగుదలకు పౌష్టికాహారంతో పాటు వినోద, వికాస కార్యక్రమాలు అవసరమని అందుకే జీజీహెచ్‌లో పిల్లల వార్డులో పిల్లలకు ఉత్సాహం కల్పించేందుకు ప్లే ఏరియా ఏర్పాటు చేసి వివిధ రకాల ఆట వస్తువులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సాల్మాన్‌రాజు, ఆర్ఎంఓ చైతన్యవర్మ, ఇతర డాక్టర్లు ఎలిజిబెత్, శివరామకృష్ణ, తాతంనాయుడు, శ్రీనివాసరావు, జయశ్రీ, రవితేజ, పద్మావతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మంచి ధర ఇవ్వాలి

- ఈ ఏడాది పొగాకు మార్కెట్ ఆశాజనకం
- పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు



వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు

కందుకూరు: వ్యాపారులు రైతులకు మంచి గిట్టుబాటు ధరలు ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు సూచించారు. కందుకూరులోని ఒకటి, రెండు పొగాకు వేలం కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వేలం జరుగుతున్న తీరును పరిశీలించి బేళ్ల రేట్లకు ఏవిధంగా ఇస్తున్నారని విషయాన్ని గమనించారు. రైతులతో మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉందని, ధర కూడా బాగుందన్నారు. రైతులు పండించిన పొగాకు జాగ్రత్త చేసుకుని వేలం కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. బోర్డు సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉండి సకాలంలో సమస్యలను పరిష్కరించాలన్నారు. వ్యాపారులు వీలైనంత వరకు రైతులకు మేలు చేసేందుకే ప్రయత్నం చేయాలని సూచించారు. అనంతరం వేలం కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే లింగసముద్రం మండలం విశ్వనాథపురంలో పర్యటించి నూతన టెక్నాలజీతో నిర్మించిన లూజ్ లీఫ్ బ్యారన్‌ను ప్రారంభించారు. రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారులు చైన్‌రామ్ మీనా, కె.రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న టిప్పర్



కోడిగుడ్ల లారీని ఢీకొట్టిన టిప్పర్



టిప్పర్ డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న హైవే అంబులెన్స్ సిబ్బంది

- ఒకరికి గాయాలు
- రూ.6 లక్షల విలువైన కోడిగుడ్లు ధ్వంసం

సింగరాయకొండ: రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉంచిన లారీని గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై జీవీఆర్ ఆక్వా కంపెనీ ఎదురు చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చీమకుర్తి నుంచి రామాయపట్నం పోర్టుకు గ్రానైట్ రాళ్ల లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ జీవీఆర్ ఆక్వా కంపెనీ ఎదురు రాయల్ హోటల్ సమీపంలోకి రాగానే నిద్రమత్తులోకి జారుకున్నాడు. ఈ క్రమంలో హైవే మార్జిన్‌లో నిలిపి ఉంచిన కోడిగుడ్ల లోడ్ లారీని టిప్పర్ బలంగా ఢీకొట్టడంతో పాటు మరో కారును కూడా ఢీకొట్టింది. ఈ సంఘటనలో శ్రీశైలానికి చెందిన టిప్పర్ డ్రైవర్ జె.రంగయ్యకు గాయాలయ్యాయి. లారీలో రూ.20 లక్షల విలువైన కోడిగుడ్లు ఉండగా అందులో సుమారు రూ.6 లక్షల విలువైన గుడ్లు ధ్వంసమయ్యాయి. కారు పక్క భాగం దెబ్బతింది. వాస్తవానికి బాపట్ల జిల్లా పర్చూరుకు చెందిన 20 మంది మూడు కార్లలో తిరుమలకు వెళ్తూ టీ తాగడం కోసం హోటల్ వద్ద ఆగారు. టిప్పర్ ఢీకొన్న సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. టిప్పర్ డ్రైవర్‌ను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు.

డీఎస్సీ-1998.. 11పోస్టులకు నేడు కౌన్సెలింగ్

ఒంగోలు: డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు సంబంధించి జిల్లాలో ఖాళీగా ఉన్న 11 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ పి.రమేష్ తెలిపారు. కాంట్రాక్టు నిబంధనల కింద మినిమం టైమ్ స్కేల్‌తో పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు మధ్యాహ్నం రెండు గంటలకు డీఈఓ కార్యాలయానికి రావాలని బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్, ఇంటర్వ్యూ కాల్ లెటర్, ఎస్ఎస్సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీఈడీ/డీఈడీ ధ్రువీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, కాంట్రాక్టు అగ్రిమెంట్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పురుషులు, స్త్రీ క్రీడాకారుల ఎంపిక ఈ నెల 28న చినగంజాం మండలం సోపిరాల తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.జాన్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు హాజరయ్యేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధృవపత్రం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే 5న గుంటూరు నాగార్జున యూనివర్శిటీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లా తరుపున పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 8978482329 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జాబ్ పోర్టల్‌లో విద్యార్థులు నమోదు చేసుకోవాలి

- కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన జాబ్ పోర్టల్‌ను కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ మూడో సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఈ జాబ్‌పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. ఈ జాబ్ పోర్టల్‌లో ఉన్నత విద్యతో అనుసంధానమైన వివిధ కంపెనీలు రిజిస్టర్ అయి ఉంటాయన్నారు. ఇంటర్న్‌షిప్‌తో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్న తర్వాత వారి విద్యార్హతలకు అనుగుణంగాకంపెనీ ఇంటర్వ్యూకు ఎంపిక అవుతారన్నారు. కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం ఇంటర్న్‌షిప్ చేస్తున్న 80 మంది విద్యార్థినులు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు. కళాశాల విద్య అధికారులు శ్రీధర్, కవిత, ప్రిన్సిపాల్ సి.హెచ్ రమణమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీనియర్ సహాయకునిపై కేసు నమోదు

ఒంగోలు అర్బన్: డివిజనల్ లెవల్ పంచాయతీ అధికారి కార్యాలయంలో పనిచేసే సీనియర్ సహాయకుడు శ్రీనివాసులుపై కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసారు. వివరాల్లోకి వెళితే..డీఎల్‌పీఓ కార్యాలయంలో పనిచేసే శ్రీనివాసులు మహిళా ఉద్యోగులను వేధిస్తున్నాడనే ఫిర్యాదులపై విచారణ చేసి కలెక్టర్ సూచనల మేరకు ఆయన్ను రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు అందచేస్తున్న ఉద్యోగిపై శ్రీనివాసులు దాడికి యత్నించగా ఆ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కలెక్టర్ అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించగా కార్యాలయ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సింగరాయకొండలో అవినీతిపై పూర్తి స్థాయి దర్యాప్తు

- విచారణాధికారిగా కనిగిరి డీఎల్‌పీఓ శోభన్‌బాబు



రికార్డులను కనిగిరి డీఎల్‌పీఓ శోభన్‌బాబుకు అప్పగిస్తున్న ఎంపీడీఓ జమీఉల్లా

సింగరాయకొండ: సింగరాయకొండ పంచాయతీలో అవినీతిపై బుధవారం కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాలతో కనిగిరి డీఎల్‌పిఓ జి.శోభన్‌బాబు ఆధ్వర్యంలో పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ గదిలో బీరువాలో సీజ్ చేసిన రికార్డులను డీఎల్‌పీఓకు ఎంపీడీఓ షేక్ జమీఉల్లా బుధవారం అందజేశారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. రికార్డులు సక్రమంగా ఉంటే దర్యాప్తు రెండు రోజుల్లో పూర్తవుతుందని లేదంటే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఇటీవల ఒంగోలు డీఎల్‌పీఓ పద్మ ఆధ్వర్యంలో చేపట్టిన విచారణలో సుమారు రూ.15 లక్షల నిధులకు సంబంధించి రికార్డులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి శరత్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ శైలజ, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో రికార్డులను సీజ్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వం నుంచి పంచాయతీలో అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు సమగ్ర దర్యాప్తు చేపడితే ఏ మేరకు అవినీతి జరిగిందో తెలుస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.